
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 131 | శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-




# ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

### లైసెన్స్ మినహాయింపు ఎత్తివేయాలి

### కేంద్రానికి రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ లేఖ

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 4):**

ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు మద్యం ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. వాటి విక్రయాలపై నియంత్రణ అవసరమని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పీ. అరుణ్‌బాబు, ఐఏఎస్ పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు ఇచ్చిన లైసెన్స్ మినహాయింపును ఇథనాల్ ఆధారిత శానిటైజర్లకు వర్తించకుండా ఉపసంహరించాలని కోరుతూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా)కు లేఖ రాశారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల సులభ లభ్యత కోసం కేంద్ర ప్రభుత్వం 27--07--2020న ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్ ద్వారా వాటి నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చిందని అరుణ్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఈ మినహాయింపును కొందరు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో మద్యానికి బదులుగా ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు, దాడులు జరిపి కొన్ని రిటైల్ మెడికల్ షాపులు ఇథనాల్ ఆధారిత శానిటైజర్లను పెద్ద మొత్తంలో విక్రయించినట్లు గుర్తించామన్నారు. విజయవాడ పటమటలోని సాయి వెంకటేశ్వర ఫార్మసీ అండ్ సర్జికల్‌కు సంబంధించిన బిల్లులను స్వాధీనం చేసుకున్నామని, వాటి ప్రకారం ఏడాదిన్నర కాలంలో సుమారు 33,586 ఇథనాల్ 70 శాతం వీవీ (100 ఎంఎల్) సీసాలను కొనుగోలు చేసి విక్రయించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మూడు రిటైల్ విక్రయ కేంద్రాలపై లైసెన్స్ రద్దు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ఇచ్చిన మినహాయింపు నాలుగేళ్ల తర్వాత కూడా కొనసాగుతుండటం వల్ల ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఇథనాల్ లేని ప్రత్యామ్నాయ హ్యాండ్ శానిటైజర్లు అందుబాటులో ఉన్నందున.. ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి ఇచ్చిన మినహాయింపును - మిగతా2లో

# సరికొత్తగా హస్త కళలు



### ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయల కళారూపాలు

### కళారూపాల తయారీలో 770 మంది కళారులకు శిక్షణ

### రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 4):**

మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35 కోట్లను వెచ్చించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770 మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివత్తులకు - మిగతా2లో

# టీటీడీ గోశాలలో వైభవంగా గోకులాష్టమి గోపూజ

### గోమాతకు శాస్త్రోక్త పూజలు నిర్వహించిన టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర

### తిరుమల శ్రీవారి సన్నిధిలో గోమాతకు విశిష్ట స్థానం –

### గోసంరక్షణకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత



# డిప్యూటీ సీఎం పవన్ చొరవ..

# పల్లె చెరువులకు కొత్త కళ

### రాష్ట్రంలో రూ. 50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ

### ఆధునిక హంగులతో ఆహ్లాదకర కేంద్రాలుగా చెరువులు

### వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులతో కొత్త రూపు



**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 4):**

సాగు నీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక కషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివద్ధిపై లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవకు 'ప్రధాన మంత్రి కషి సించాయీ యోజన' పథకం తోడవడంతో - మిగతా2లో

# మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి స్పష్టమైంది

### సెప్టెంబర్ 8న విజయవాడలో ప్రత్యేక సమావేశం

### సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

**అంకుశం న్యూస్**
**విజయవాడ సెప్టెంబర్ 4**



కేంద్రంలో 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి ఢిల్లీలో నిర్వహించిన సీపీఐ భారీ ర్యాలీ ద్వారా స్పష్టంగా వ్యక్తమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రచార కార్యక్రమాల అనంతరం నిర్వహించిన ర్యాలీని అడ్డుకునేందుకు పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆటంకాలు కల్పించినప్పటికీ వేలాదిమంది కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు భారీగా పాల్గొని విజయవంతం చేశారని పేర్కొన్నారు. దేశంలోని సిక్కిం, మిజోరం మినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో విస్తృత ప్రచారం నిర్వహించామని తెలిపారు. కేరళలో ప్రత్యేక రైలును చివరి నిమిషంలో నిలిపివేయడం, తమిళనాడులో రైళ్లు రద్దు చేయించడం, ఉత్తరప్రదేశ్‌లో సీపీఐ నాయకులను అరెస్టు చేసి గృహనిర్బంధంలో ఉంచడం వంటి చర్యల ద్వారా ర్యాలీని అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.

**అక్టోబర్ 2న దేశవ్యాప్త కార్యక్రమాలు**

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న అన్ని మతాలు, కులాలు సామరస్యంగా కలిసి జీవించాలనే సందేశంతో దేశవ్యాప్తంగా ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించనున్నట్లు రామకృష్ణ తెలిపారు. అమెరికాలో మత సామరస్యంపై మాట్లాడిన ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్, దేశంలో మాత్రం మైనారిటీలపై జరుగుతున్న దాడులపై స్పందించడం లేదని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకత్వంలోనే మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.

**నవంబర్ 7న రష్యా విప్లవ దినోత్సవం**

ప్రపంచంలో తొలి కమ్యూనిస్టు రాజ్యం ఏర్పడిన రోజును పురస్కరించుకుని నవంబర్ 7న దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

**డిసెంబర్‌లో 'జైలు భరో'**

డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో దేశవ్యాప్తంగా "జైలు భరో" కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇందులో కనీసం పది లక్షల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు జైళ్లకు వెళ్లేలా ఉద్యమాన్ని నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని చెప్పారు.

**ఏపీలో కరువు మండలాలు వెంటనే ప్రకటించాలి**

ఆంధ్రప్రదేశ్‌లో 300కు పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని రామకృష్ణ విమర్శించారు. ఒక్క ఎకరాలో కూడా పంట పండని పరిస్థితి ఉన్నా ఇప్పటివరకు కరువు మండలాలు ప్రకటించలేదని అన్నారు. వెంటనే కరువు మండలాలు ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని, వలసలను నివారించాలని, రైతులకు తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఈ అంశాలపై ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 8న విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజలను సమీకరించి కరువు సమస్యపై పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతున్నామని పేర్కొన్నారు.

# సరికొత్తగా హస్త కళలు

-మొదటిపేజీ తరువాయి

అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16,314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణివ్వనున్నట్లు వెల్లడించారు. గురు--శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురు--శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు. గురు--శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్పీపీ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెక్క



బ్లాక్ తయారీ, కలంకారి బ్లాక్ ప్రింటింగ్, దుర్గి రాతి శిల్పం, అగరుబత్తి తయారీ, తాటి ఆకుల కళ, కొబ్బరి చిప్పల కళ, శ్రీకాళహస్తి కలంకారి వంటి హస్తకళలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురు--చెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకు--వెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గి రాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రీవుడ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రొగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా కార్యక్రమాలు కష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

# టీటీడీ గోశాలలో వైభవంగా గోకులాష్టమి గోపూజ

**అంకుశం న్యూస్ తిరుమల సెప్టెంబర్ 4** గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ శాలలో శుక్రవారం ఉదయం గోపూజ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర గోశాలలోని శ్రీ వేణుగోపాలస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ గోమాత, దూడలకు నూతన వస్త్రాలు, పుష్పమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతకు భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేసి హారతి సమర్పించారు.

ఈ సందర్భంగా టిటిడి ఈవో గోమాత పాలను స్వయంగా పితికి, పవిత్రమైన ఆ పాలను ఆలయ అర్చకులకు అందించారు. ఆ పాలను శ్రీ వేణుగోపాలస్వామివారికి అభిషేకం చేయడం విశేషంగా జరిగింది.

7 కోట్ల సార్లు "ఓం నమో వేంకటేశాయ" జప సమర్పణ

అనంతరం "ఓం నమో వేంకటేశాయ" మహామంత్రాన్ని 7 కోట్ల సార్లు జపించిన జప పుస్తకాలను స్వామివారికి సమర్పించే కార్యక్రమాన్ని ఈవో సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపను కోరారు.



గోమాత పూజ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన సంప్రదాయమని, గోమాతలో సమస్త దేవతా స్వరూపాలను దర్శించే గొప్ప ఆధ్యాత్మిక విశ్వాసం మన సంప్రదాయంలో ఉందన్నారు.

గోసంరక్షణ, గోసేవకు టీటీడీ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ గోశాలను మరింత అభివృద్ధి చేస్తోందని పేర్కొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ చొరవ..
# పల్లె చెరువులకు కొత్త కళ

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. పవన్ కళ్యాణ్ దార్శనికత, అభివద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తత స్థాయిలో అభివద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం రూ.50 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 26 చెరువులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అనంతపురం, పల్నాడు, శ్రీ సత్యసాయి, చిత్తూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఇప్పటికే చెరువుల అభివద్ధి పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల అభివద్ధికి పెద్దపీట వేస్తూ, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వద్ధికి తోడ్పడనున్నాయి. చెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన



వాతావరణం కల్పించేలా పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

## ధర్మవరంలో పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

22 మంది అరెస్ట్.. రూ.59,550 నగదు, 21 సెల్‌ఫోన్లు స్వాధీనం!




**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 4** ధర్మవరం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి 22 మందిని అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి రూ.59,550 నగదు,21 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,ధర్మవరం ఎస్‌డీపీఓ పర్యవేక్షణలో విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు ఈ దాడి నిర్వహించారు. ధర్మవరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో ధర్మవరం టౌన్,రూరల్ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు వీరేష్,రాజశేఖర్, సిబ్బంది సంయుక్తంగా దాడిలో పాల్గొన్నారు. పేకాట ఆడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకుని,నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు.

**అక్రమ కార్యకలాపాలపై నిఘా:**

ధర్మవరం పట్టణంలో పేకాట,జూదం,ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని సీఐ రెడ్డప్ప తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేసి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

## చేనేతలకు ఇంకా రాని వారికి నేతన్న సేవలో ఎప్పుడు? జమ చేస్తారు?

**ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్!**




**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 4** నేతన్న సేవా పథకం కోసం తేదీలను పొడిగిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఏపీ చేనేత కార్మిక సంఘం ధర్మవరం చేనేత ఆఫీస్ నందు ఏపీ చేనేత కార్మిక సంఘం ప్రెస్ మీట్ నిర్వహిస్తూ ఈ సందర్భంగా ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె.వి.రమణ ,పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏ ఖాదర్ భాషా, గుంపు హరి మాట్లాడుతూ మొదటి విడతలో నేతన్న సేవా పథకం వర్తించని అర్హులైన కార్మికులకు ఆగస్టు 30 తారీఖున అందరి అకౌంట్ లోకి జమ చేస్తామని చేనేత జౌళి శాఖమంత్రి శ్రీమతి సవితమ్మ గారు చెప్పడం జరిగినదని, ఆగస్టు 30 తారీఖున ఆదివారం అయినప్పటికీ జమ చేస్తామని పదేపదే చెప్పడం జరిగినదని అయితే నాలుగు రోజులు అయినప్పటికీ జమ కాలేదని, మరల అధికారులతో చర్చలు జరిపి పదవ తారీకు లోపు అందరి అకౌంట్లు లోకి నేతన్న సేవా పథకం జమ చేస్తామని హామీ ఇవ్వడం జరిగినదని, అయితే ఈ విధంగా తేదీలు పొడిగించడం వలన చేనేత కార్మికులు విపరీతమైన ఆందోళనకు గురి అవుతున్నారని, మొదటి విడతలో అర్హులైన కార్మికులను గుర్తించకపోవడం ఈ పథకం అనర్హుల పాలైనదని, ఇప్పటికైనా అర్హులైన ప్రతి చేనేత కార్మికునికి నేతన్న సేవా పథకం వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని ,ఆ విధంగా కాకుండా కార్మికులకు అన్యాయం జరిగే విధంగా రెండో విడత కూడా జరిగితే ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి చేనేత కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు అన్నం సూరి ,పులిచెర్ల హరి, లోకేష్ ,సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

## ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

-మొదటిపేజీ తరువాయి

ఉపసంహరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పీ. అరుణ్‌బాబు కోరారు. ప్రజా ప్రయోజనాలను దష్టిలో ఉంచుకుని ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్‌ను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజలే తగిన గుణపాఠం చెపుతారు

**కరీంనగర్‌లో బీఆర్ఎస్ 'వంటా వార్పు' నిరసన..**

**మాజీ మంత్రి గంగుల కమలాకర్ ధ్వజం**

**కరీంనగర్** : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం 'వంటా వార్పు' నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు మహిళల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

**గోదావరిఖని** : కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను

## అక్రమ ఇసుక రవాణాకు తగ్గేదే లేదు

పుష్ప సినిమాను తలపిస్తున్న ఇసుక ట్రాక్టర్లు

అడ్డుకునే నాధుడే కరువు



**సింగనమల అంకుశం న్యూస్ సెప్టెంబర్ 4** మండలంలో అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోంది. పుష్ప సినిమాను తలపించేలా ట్రాక్టర్లు ఒకదాని వెనక ఒకటి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ వాటిని టిప్పర్లకు నింపి రాత్రి సమయంలో ఎవరికి తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా రవాణా చేస్తూ లక్షలాది రూపాయలు కొల్లగొడుతున్నారు. ఏటువంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న సంబంధిత శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా కొంతమంది అక్రమ ఇసుక వ్యాపారస్తులు మూడు పూలు ఆరు కాయలు లాగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా సింగనమల మండలంలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నట్లు కొంతమంది తెలియజేస్తున్నారు. మండలంలో ఇప్పటికే బోరు బావులు ఎండిపోతున్నాయని అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజాప్రతినిధులను అధికారులను ఎన్ని మార్లు వేడిన కూడా ఎవరు పట్టించుకోవడంలేదని సింగనమల మండల ప్రజలతో పాటు రైతన్నలు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొంతమంది ప్రజాప్రతినిధులు అధికారులు ఇదంతా మాకు మామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కనీసం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ వారైనా స్పందించి తగు చర్యలు తీసుకొని అక్రమ ఇసుక రవాణా అరికట్టకపోతే తాము పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని మండల రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నాల్గవ రోజుకు చేరిన సత్యసాయి కార్మికుల నిరవధిక దీక్ష




**బుక్కరాయసముద్రం అంకుశం న్యూస్ సెప్టెంబర్ 4** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సత్యసాయి కార్మికులు నాలుగు రోజుల నుంచి బకాయి ఉన్న ఐదు నెలల వేతనాలు మంజూరు చేయాలంటూ నిరవధిక దీక్ష చేస్తున్నారు. బుక్కరాయసముద్రం పంప్ హౌస్ నందు జేఏసీ కమిటీ కార్మిక సంఘం నాయకులు జగదీశ్వర్ రెడ్డి జయప్రకాష్ ,చిన్న రాజు, కుమార్ నాయుడు, గంగప్ప ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి కార్మికులకు వేతనాలు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రతి దినం సమాజంలో మనిషికి నీరు చాలా అవసరం అన్నారు. నీరును సరఫరా చేసే కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు మంజూరు చేయకపోవడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికుల కుటుంబ పోషణ చాలా దుర్భరంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికులకు పెండింగ్లో ఉన్న ఐదు నెలల వేతనాలను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి కార్మికులు వీరయ్య ఓబులేసు శంకర రామకృష్ణ నరహరి విజయ్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతంలో గమ్యం క్యాంపస్ ఏర్పాటు అభినందనీయం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 04:** పెదపూడి మండలం పెద్దాడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గమ్యం క్యాంపస్ భూమి పూజ కార్యక్రమానికి శుక్రవారం అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరాలకు మాత్రమే పరిమితమయ్యే ఇటువంటి ఆధునిక విద్యా మరియు శిక్షణ క్యాంపస్‌ను గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేలా ముందుకు వచ్చిన గమ్యం క్యాంపస్ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. క్యాంపస్ నిర్మాణ పనులు విజయవంతంగా ముందుకు సాగాలని యాజమాన్యానికి, నిర్వాహకులకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## తిరుమలలో ఘనంగా గోకులాష్టమి వేడుకలు



**అంకుశం న్యూస్ తిరుమల సెప్టెంబర్ 4** తిరుమలలో శుక్రవారం గోకులాష్టమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గోగర్భం డ్యామ్ చెంతగల ఉద్యానవనంలో కాళీయమర్ధనుడు అయిన శ్రీకృష్ణునికి ఉదయం పంచాభిషేకాలు చేశారు. అనంతరం అక్కడ ఉట్లోత్సం నిర్వహించారు. ఆ తరువాత ప్రసాద వితరణ జరిగింది. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా, శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద రాత్రి 8 నుండి 9గంటల నడుమ ఉగ్ర శ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామివారికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహిస్తారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం ఘనంగా చేపడతారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని వైదికులు నివేదిస్తారు. శనివారం సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల మధ్య తిరుమలలో అత్యంత వైభవంగా ఉట్లోత్సవం నిర్వహిస్తారు. శ్రీ మలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామివారు మరో తిరుచ్చిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ ఈ ఉట్లోత్సవాన్ని తిలకిస్తారు. ఈ కారణంగా ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

## కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట

-- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కీలక ఉత్తర్వులు జారీ

-- రేడియోగ్రాఫర్లు, నర్సులు, పీహెచ్‌సీ సిబ్బంది సమస్యలకు పరిష్కారం



**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 4):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు సమీక్షలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట నిచ్చేలా కీలక ఉత్తర్వులు జారీ చేశారు. రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. బోధనాస్పత్రుల్లో ఎక్స్‌రే, రేడియాలజీ విభాగాల్లో విధులు నిర్వహించే అర్హులైన సిబ్బందికి ప్రతి 11 నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల తప్పనిసరి ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించరాదని స్పష్టం చేసింది. డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులకు కూడా పీహెచ్‌సీల్లో క్లినికల్ శిక్షణకు అవకాశం కల్పించారు. 6 లేదా 12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో శిక్షణ పొందేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు. శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా అందే ప్రోత్సాహకాల్లో డాక్టర్లతో పాటు వాటిలో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ వారి క్యాడర్‌కు అనుగుణంగా నిర్ణయించిన వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సంబంధిత సిబ్బందిని కూడా అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు, పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని



**కనిగిరి సెప్టెంబర్ 4 అంకుశం న్యూస్** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలోని జంగాలపల్లి గ్రామంలో వెలసి ఉన్న ఆవుదేవర, శ్రీకృష్ణ దేవస్థానంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి పాల్గొని శ్రీకృష్ణ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దారపనేని, బైరెడ్డి మాట్లాడుతూ శ్రీ మహావిష్ణువు ఎనిమిదవ సంపూర్ణావతారమైన శ్రీకృష్ణుడు ఆవిర్భవించిన పవిత్రమైన రోజు అని, భూమిపై దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మరియు ధర్మాన్ని నిలబెట్టడానికి శ్రీకృష్ణుడు శ్రావణమాసంలో శుక్లపక్షం అష్టమి తిథినాడు అర్థరాత్రి రోహిణి నక్షత్రంలో జన్మించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహకులు మాజీ ఏఎంసి దారపనేని, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి, దారపనేని చిన్న చెన్నయ్య, యరసింగ్ వెంకటేశ్వర్లు, మోపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు మోరుబోయిన గిడ్డయ్య యాదవ్, దారపనేని రాజేంద్రప్రసాద్, మిరియం సుబ్బరాయుడు, తిరివీధి చంద్రశేఖర్, కల్లూరి సురేష్ చౌదరి, మట్లే రాహుల్ యాదవ్,యరశింగ్ రాయుడు, మానం కొండలరావులను దుశ్యాలవలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య, చెనికల కొండయ్య (పెద్దాయన) చెనికల వారి బ్రదర్స్, మానం వారి బ్రదర్స్, దేవస్థాన నిర్వహణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం లో మహిళా క్రికెట్ సెలక్షన్స్ సెప్టెంబర్ 5 ఆసక్తి కల మహిళా క్రికెటర్లు పాల్గొనండి




**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి సెప్టెంబర్ 4** రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలోఅనంతపురం పట్టణంలోనిఆర్డిటి క్రీడా మైదానం నందుమహిళా క్రికెట్ సెలక్షన్స్ సెప్టెంబర్ 5 తారీఖున ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది 10 సంవత్సరాలనుండిఅండర్ 15 లోపు అమ్మాయిలకుఅండర్ 18 రెండు గ్రూపులుగా సెలక్షన్లు జరుగునురూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ =ఖ ఆధ్వర్యంలో సత్య సాయి జిల్లా అనంతపురం జిల్లాలోని ప్రతిభ ఉన్న గ్రామీణ మహిళా క్రికెటర్లను గుర్తించే కార్యక్రమం తీసుకోవడం జరిగింది ఇప్పటికే హిందూపురంలో ప్రారంభించి కదిరి గుంతకల్ ధర్మవరం కళ్యాణ్ దుర్గం ప్రాంతాల్లో మహిళా క్రికెటర్లకు సెలక్షన్లు నిర్వహించడం జరిగింది చివరిగా అనంతపురం పట్టణంలోని ఆర్డిటి మైదానం నందు నిర్వహించడం జరుగుతున్నదిఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ పేరుతో జిల్లా వ్యాప్తంగా మహిళా క్రికెట్ సెలక్షన్లు నిర్వహించడం జరుగుతున్నది అనంతపురం సింగనమల రాప్తాడు నియోజకవర్గం లలోచుట్టుపక్కల ప్రాంతాల్లో మహిళా క్రికెట్ పట్ల ఆసక్తి ఉన్నటువంటి వాళ్లు స్కూళ్లు కాలేజీలు ఇతర సంస్థల్లో పనిచేస్తున్న మహిళా క్రికెటర్లందరూ ఈ ఎంపికలో పాల్గొనవచ్చును ఆసక్తి గల వారు నేరుగా మైదానంకు వచ్చి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోగలరు

## ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసంలో వైభవంగా వరలక్ష్మి వ్రత పూజలు

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**అంకుశం న్యూస్,అనంతపురం,సెప్టెంబర్:4:** శ్రావణమాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకుని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసంలో వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు అత్యంత సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ,నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వారు అమ్మవారిని వేడుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో అత్యంత ఆప్తులు,బంధుమిత్రులు మాత్రమే పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు,మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి కలశ స్థాపన చేసి,ప్రత్యేక అర్చనలు,నైవేద్యాలు సమర్పించారు. పూజ అనంతరం ఎమ్మెల్యే సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మీ సుమంగళి పూజలు నిర్వహించి,వేడుకకు విచ్చేసిన మహిళలందరికీ తాంబూలాలతో పాటు వాయినాలు అందజేశారు. విచ్చేసిన అతిథులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. నివాస ప్రాంగణమంతా శ్రావణ శోభతో,ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.

## గమ్యం జూనియర్ కాలేజ్ నూతన క్యాంప్ భవనశంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 04:** పెదపూడి మండల పరిధిలో పెద్దాడ గ్రామంలో గమ్యం జూనియర్ కాలేజ్ నూతన క్యాంప్ భవనముల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తో పాటు పెదపూడి మండల కూటమి నాయకులు, పెద్దాడ గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో కృష్ణుడు వేషధారణలతో అలరించిన చిన్నారులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 04:** బిక్కవోలు మండలం లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలంలోని ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలు హడావిడి అంతా చిన్నారులదే బాలకృష్ణుడు, రాధా గోపికల వివిధ వేషధారణలో చిన్నారులు అందరూ అలరించారు. ఉదయం నుంచి ఉట్టి కొట్టి కార్యక్రమాలను ఏర్పాట్లు చేసి శ్రీకృష్ణ అష్టమి సందర్భంగా కృష్ణుడు పై పలు పాటలకు నృత్యాలు చేశారు. కొమరిపాలెం గ్రామంలో శ్రీరామ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వద్ద శ్రీకృష్ణ అష్టమి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కర్రి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు చేసిన అల్లరి గురించి మాత్రమే కాకుండా ఆయన చేసిన మంచి పనులను విద్యార్థులకు వివరించారు. గీతా సందేశం యొక్క గొప్పతనాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలిపారు. అలాగే పందలపాక గ్రామంలో శ్రీ కట్లమ్మ తల్లి ఆలయం వద్ద చిన్నారుల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశేషంగా చిన్నారులు యువకులు పాల్గొన్నారు. అలాగే వేలంపేట రామాలయం వద్ద కృష్ణాష్టమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి. భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు విశేషంగా పాల్గొన్నారు.

## కృతజ్ఞతలు తెలిపిన సివిల్ సర్జన్ తాడి..... అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే నల్లమిల్లి....



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 04:** అనపర్తి ఏరియా హాస్పిటల్లో సుదీర్ఘ కాలంగా సూపరింటెండెంట్ గా.. సేవలు అందించి, ఇప్పుడు సివిల్ సర్జన్ గా జోనల్ మలేరియా అధికారి గ్రా మీగా పదోన్నతి పై వెళుతున్న డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామ కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగాకలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ గుర్రెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రత్యేకంగా అభినందించారు.

# ఉపాధ్యాయ వృత్తిని మించిన వృత్తి మరొకటి లేదు







**- ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ**

**65 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం**

**అంకుశం న్యూస్అనంతపురము, సెప్టెంబర్ 04 :** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన గొప్ప వృత్తి మరొకటి లేదని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా జి. లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మేరా యువ భారత్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్ నందు గురుపూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్స వ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా జి. లక్ష్మీనారాయణ, విశ్రాంత ప్రిన్సిపాల్ డా. పతిక రమేష్ నారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. పద్మశ్రీ, మై భారత్ ప్రతినిధి బిసాటి భరత్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డా. గీతా బాల తదితరులు పాల్గొన్నారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా, వారి జీవితాలకు మార్గదర్శకులుగా నిలుస్తారు. సమాజానికి మంచి పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యం. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సత్కరించడం అభినందనీయం అని అన్నారు. తదనంతరం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న 65 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ డా. గజ్జల లక్ష్మణ ప్రసాద్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహ వ్యవస్థాపకులు పి. దీపు కిరణ్ రెడ్డి, సభ్యులు ధోని, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు గొర్తి వెంకట స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాసింగ్ అవుట్ పరేడ్ రిహార్సల్స్ పరిశీలించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్





**శిక్షణార్థుల నుండీ గౌరవ వందనం స్వీకరించి పరేడ్ ను సమీక్షించి మెళకువలు సూచించిన జిల్లా ఎస్పీ జగదీష్**



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 4** అనంతపురం జిల్లా శిక్షణ కేంద్రం (డీటీసీ) లో గత 9 నెలలుగా కఠోర శిక్షణ పొందుతున్న 101 మంది సివిల్ కానిస్టేబుల్ ఏ ఎస్ సి టి పి సి అభ్యర్థుల 'పాసింగ్ అవుట్ పరేడ్' తుది దశకు చేరుకుంది. ఈనెల 7 వ తేదీన జరగనున్న ఈ వేడుకను పురస్కరించుకుని స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో సాధన చేస్తున్న శిక్షణార్థుల పరేడ్ రిహార్సల్స్‌ను లిజిల్లా ఎస్పీ పి. జగదీష్, శుక్రవారం నేరుగా పరిశీలించి సమీక్షించారు. ?గత తొమ్మిది నెలలుగా డీటీసీలో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, చట్టాలు, శాంతిభద్రతల పరిరక్షణపై అభ్యర్థులు పొందిన శిక్షణ ప్రతిబింబించేలా పరేడ్ నిర్వహణ ఉండాలని ఎస్పీ ఆదేశించారు. అడుగులో అడుగు కలిపి, ఏకాగ్రతతో చేసే మార్చ్ ఫాస్ట్ నైపుణ్యాలను, బ్యాండ్ మేళవింపును, కవాతు తీరును ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 101 మంది శిక్షణార్థులు కనబరిచిన ఉత్సాహం, క్రమశిక్షణను అభినందిస్తూనే, పాసింగ్ అవుట్ పరేడ్ రోజున ప్రదర్శన మరింత బాధ్యతాయుతంగా, కంటికి ఇంపైన రీతిలో ఉండేలా తుది మెరుగులు దిద్దాలని పోలీసు అధికారులను సూచించారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదాన పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి సంబంధించి సీటింగ్ ఏర్పాట్లు, విజిటర్ల మేనేజ్‌మెంట్, మరియు మైక్ సిస్టమ్ వంటి అన్ని విభాగాల్లో ఎక్కడా చిన్న లోపం కూడా రాకుండా పక్కా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం (పరిపాలన), డీటీసీ డీఎస్పీ బి.విజయకుమార్ , ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, పలువురు సి.ఐ లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిబిఆర్ జూనియర్ కళాశాలలో ప్రెషర్స్ డే ఉత్సవాలు







**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 04:** అనపర్తి జిబిఆర్ జూనియర్ కళాశాల నందు ప్రెషర్స్ డే ఉత్సవాలు ఘనంగా జరిగినాయి ఈ కార్యక్రమం లో జూనియర్ విద్యార్థులు మరియు సీనియర్ విద్యార్థులు కలిసి పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు తమ యొక్క కళాశాల అనుభవాలను జూనియర్ విద్యార్థులు చదువు పెంపొందించుకునే విద్య విషయాలపై చర్చించుకుని అందరూ కలిసిమెలిసి ఉండేలా ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ర్యాగింగ్ అనేది మనకి పూర్తిగా నిషిద్ధము మరియు మన ప్రాంతంలో ఆ సంస్కృతి లేదు ఈ సందర్భంగా ఈ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశము మరియు విద్యార్థుల మధ్య ఐక్యత ఉపాధ్యాయులపై విద్యార్థులు ఉంచవలసిన గౌరవం గురించి ప్రధాన వక్తలు మాట్లాడటం జరిగింది అంతేగాకుండా కీర్తిశేషులు గొలుగూరి బాపిరాజు యొక్క త్యాగ ఫలితంగా ఈ ప్రాంత విద్యార్థులు అక్షరాస్యత మరియు ఉద్యోగాలను సాధించడం జరిగింది మరియు జరుగుతుంది ఆ మహనీయుని సేవలు మరువలేము అని ఆయనను కొనియాడారు ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ జి జగన్నాథరెడ్డి డిగ్రీ కళాశాల డైరెక్టర్ డివిఆర్‌పి పాపిరెడ్డి ఇంటర్మీడియట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం ఉమా వెంకటరెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.పి అబ్బాయి రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ మల్లిడి వీర వెంకట రామారెడ్డి మహేందర్ రెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి ఆర్ ఎల్ స్వామి వైస్ ప్రిన్సిపాల్స్ సోమశేఖర్ దొరయ? నాయుడు ,రంజిత్ కుమార్ ,దేవి ,అధ్యాపక అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొన్నారు

## అక్టోబరు నుంచి ఏపీలో కొత్త పింఛన్లు...

**అర్హులందరికీ దశలవారీగా ఇద్దాం**

**స్థానిక ఎన్నికల వాయిదా ప్రసక్తే లేదు**

**మంత్రులతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్లో లోకేశ్**

**అన్ని కేటగిరీల వారి నుంచి పింఛను దరఖాస్తులు**

**రెండు, మూడు రోజుల్లో స్వీకరణ ప్రారంభం**

**అంకుశం న్యూస్, ఆంధ్రప్రదేశ్, సెప్టెంబర్ : 4** కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా రెండు, మూడు రోజుల్లో ప్రారంభించను న్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతో పాటు అన్ని కేటగిరీల పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏయే కేటగిరీల పింఛన్లకు దరఖాస్తుల్ని ఎలా తీసుకోవాలనే దానిపై గురువారం రాత్రి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ అధికారులు చర్చించారు. అధికారులు ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. శుక్రవారం సీఎం చంద్రబాబు దృష్టికి దీన్ని తీసుకెళ్లి ఆయన ఆమోదంతో ముందుకు వెళ్లనున్నారు. పింఛను దరఖాస్తుల సంఖ్యకు అనుగుణంగా అందరికీ ఒకేసారి ఇవ్వాలా, లేదా దశల వారీగా ఇవ్వాలా అనే దానిపై మీటింగ్లో లోకేశ్ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

## ఘనంగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జె రత్నాకర్ జన్మదిన వేడుకలు.



**అంకుశం న్యూస్,పుట్టపర్తి,సెప్టెంబర్:4:** సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రత్నాకర్ 56వ జన్మదిన సందర్భంగా వారి నివాసం వద్ద గజమాల క్రేన్ తో శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ.అదే విధంగా 56 కేజీల కేక్ కట్ చేయడం జరిగింది.నృత్యాలతో చిన్నారులు స్వాగతం పలికారు.భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో అదే విధంగా రత్నాకర్ సార్ గారి ఆశీసులతో ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అని తెలియజేశారు.రత్నాకర్ నిండునూరేళు ్ళ సుఖ సంతోషాలతో ఉండాలి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## టీచర్స్ డే సందర్భంగా విజయవాడ మున్సిపల్ కమిషనర్ ప్రద్యుమ్నచే నిమ్మరాజుకు సత్కారం

**గురుదేవుల పాదపద్మాలకు ప్రణామాలు!**





**అంకుశం న్యూస్ గుంటూరు సెప్టెంబర్ 4** తల్లిదండ్రుల తరువాత గురుదేవులను నిత్యం స్మరించుకోవాల్సిందే. ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చిన నేను దాదాపు ఐదేళ్లపాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నాను. అదే పంథాలో గుంటూరు జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్లు 25 బృందాలకు ప్రజా సంబంధాలు, సత్ప్రవర్తనపై శిక్షణ తరగతులు నిర్వహించగలగడం కూడా మహా అదృష్టం. బాపట్ల జిల్లా తిమ్మసముద్రంలోని శ్రీ గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాలలో భాషా ప్రవీణ ఐదేళ్ల కోర్సు, ఆపై పీవోఎల్ (ప్రా.నా.నా) కోర్సు పూర్తి చేసి, హైదరాబాదులో తెలుగు పండిట్ శిక్షణ కూడా పొందాను. 1982 ప్రాంతంలో గుంటూరు జిల్లా తెనాలిలో ఆంధ్రపత్రిక విలేకరిగా చేరి మరోవైపు మమతా నికేతన్, నెహ్రూ నికేతన్, యూకా నికేతన్ స్కూళ్లలో, శ్రీనివాస ట్యుటోరియల్స్ లోనూ తెలుగు పండిట్ గా పనిచేశాను. ప్రశాంత విద్యావిహార్ కు సలహాదారుగా వ్యవహరించాను. పత్రికలో పనిచేస్తూనే 1985లో ప్రకాశం జిల్లా, ఉలవపాడు సమితి, మొగిలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 మాసాలపాటు తెలుగు పండిట్ గా పనిచేశాను. ఆపై రాజీనామా చేసి, ఆంధ్రపత్రికకు గుంటూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గా చేరాను. ఏదిఏమైనా ఇటు జర్నలిజం, అటు ఉపాధ్యాయ వృత్తి నాకు రెండు కళ్ళలాంటివి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురుదేవుల పాదపద్మాలకు ప్రణమిల్లుతూ..

## పుట్టపర్తిని మోడల్ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల ఉన్నతస్థాయి సమీక్ష**

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**



**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి,సెప్టెంబర్,03:** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్, పుట్టపర్తి శాసనసభ్యురాలు మరియు మాజీ మంత్రివర్యులు లతో కలిసి పుట్టపర్తి పురపాలక సంఘ పరిధిలో మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా మరియు పారిశుధ్య నిర్వహణపై సమగ్ర ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రాముఖ్యత పొందిన దృష్ట్యా, ఈ ప్రాంతాన్ని పరిశుభ్రమైన, ఆధునికమైన మోడల్ నగరంగా మార్చేందుకు స్పష్టమైన ప్రణాళికను ఖరారు చేశారు. పుట్టపర్తిని పూర్తిగా "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత", "స్టాగ్నెంట్ వాటర్ (నిల్వ నీరు) రహిత" మరియు "చెత్త రహిత పురపాలక సంఘంగా" తీర్చిదిద్దేందుకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ సిద్ధం చేశారు.ప్రతి ఇల్లు మరియు వాణిజ్య సముదాయాల నుంచి తడి, పొడి చెత్తను తప్పనిసరిగా 100% వేర్వేరుగా సేకరించాలి. దీని కోసం ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్లు ఉన్న వాహనాలను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.వర్షాకాలం దృష్ట్యా వెంటనే డ్రెయిన్లలో పూడికతీత పూర్తి చేయాలని, రహదారులపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తికాకపోతే లేదా పారిశు ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమములో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు,పబ్లిక్ హెల్త్ నరసింహ మూర్తి , మైన్స్ ఏడీ, మున్సిపల్ మరియు పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**అంకుశం న్యూస్,నల్లచెరువు,సెప్టెంబర్:4:** కదిరి నియోజకవర్గం, నల్లచెరువు మండలం, గీతా మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకల్లో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భం గా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకి ఆలయ నిర్వాహకులు,భక్తులు ఘన స్వాగతం పలికారు.అనంతరం శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,కదిరి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషా లతో,ఆయురారోగ్యాలతో,ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలు,ఆధ్యాత్మిక కార్యక్ర మాల్లో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి వేడుకలను జరుపుకున్నారు. ధర్మాన్ని, సత్యాన్ని,మానవతా విలువలను ప్రపంచానికి చాటిన శ్రీకృష్ణుని బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు.శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి,సౌభాగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.